

అడ్డాకులలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# అధికారం కోసమే బూటకపు హామీలు

- రైతులు ఇబ్బందిపడు తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- మూడు నెలల్లోనే పాత రోజులు తీసుకొచ్చారు..
- ప్రజలు ఆలోచించి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి
- సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి శ్రీని వాస్‌గౌడ్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 21 : అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చిందని, రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం అడ్డాకులలోని మాతృశ్రీ పాఠశాలలో అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉచిత కరెంట్, సా గు, తాగునీరు, రైతుబంధు, పింఛన్లు, రైతుబీమా, గొర్రెలు, బర్రెలు ఇలా అన్నీ అడగక ముందు ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదన్నారు. 120 కాంగ్రెస్ పాలనలో అన్నీ పోయి మళ్లీ 2014కు ముందు రోజులు వచ్చాయన్నారు. ఇప్పుడున్న ఎంపీ స్థానాన్ని కూడా వదులుకుంటే కాంగ్రెస్ పార్టీని అడిగేటోడు ఉండడు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీగా గెలిస్తే వారు ఇచ్చిన హామీల మాట దేవుడెరుగు కనీసం కేసీఆర్ అమలు చేసిన పథకాలనైనా కొనసాగిస్తారా అనే అనుమానం వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ,అవ్వ, తాతలకు, రూ.4వేల పింఛన్ , కుటుంబ పెద్ద, కోడలికి రూ.2500, రైతు బంధు రూ.15వేలు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజలు ఆలోచించుకోవాలి బీఆర్ఎస్ హయాంలో మీకు ఏం కావాలన్నా ముందు నిలబడి కేసీఆర్‌తో మాట్లాడి ఇప్పించేటోళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితి ఏంటో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు.

**అసమర్థ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మాజీ ఎమ్మెల్యే ఆల**

గారడి మాటలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కి హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈ అసమర్థ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అమలు కాని హామీలు, అబద్ధపు ప్రచారం చేస్తుంటే మన పార్టీ శ్రేణులు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం వల్లనే ఓటమి పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకోసం మనం చేయాల్సిందల్లా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన మ్యానిఫెస్టోను తీసుకొని వారు చెప్పిన హామీలు ప్రజలకు ఎన్ని అందాయి. అందితే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయండి. అందకుంటే కారు గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జి పల్లెరవి కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదిజలాలను ఎత్తిపోతల ద్వారా తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తే.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేస్తూ కృష్ణా, గోదావరి నదీ జలాలను ఇతర రాష్ట్రాలకు తరలించాలని కుట్రలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలిస్తే అన్ని వర్గాలలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం మళ్లీ అట్టడుగు స్థాయికి వెళ్లక తప్పదన్నారు. అందుకని ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటేనే మనకు బతుకుదెరువు ఉంటుందన్నారు.





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల, రవికుమార్

## మీ తరపున ప్రశ్నించే గొంతుకనవుతా..



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి నన్ను ఎంపీగా గెలిపిస్తే మీ తరపున పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కేవలం మహిళలకు బస్సుల్లో ప్రయాణం మాత్రం అమలు చేశారు. ఉచితం పేరుతో భార్యాభర్తలు, తండ్రీ కూతురు, అన్నా చెల్లెల్లను విడదీస్తున్నట్లు ఉంది. బస్సుల్లో ప్రశాంతంగా సాగాల్సిన మహిళల ప్రయాణంలో ప్రతి రోజూ కొట్టుకునే పరిస్థితి దాపురించింది. మంచి చేసే కేసీఆర్ పార్టీని గెలిపించుకోవాలో లేదో ప్రజలే ఆలోచించుకోవాలి. మనకు అధికారం ఉంటే మీ తరపున నిలబడానికి నేను ఎప్పటికీ ముందు వరుసలో ఉంటాను. కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి కారు గుర్తుకు ఓట్లు వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలి.

**– మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ**



సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు

# ఎంపీగా గెలిపించండి

- మార్నింగ్‌వాక్‌లో ఆర్‌ఎస్‌పీ విజ్ఞప్తి

కొల్లాపూర్, ఏప్రిల్ 21 : బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కొల్లాపూర్ పట్టణంలో ఆదివారం మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో మినీ స్టేడియంలో క్రీడాకారులు, సీనియర్ సిటిజన్లను కలిసి నాగర్‌కర్నూల్ ప్రాంతంలో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులను కలిసి ఈ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లోకి లోడ్‌తో వచ్చిన ట్రాన్స్‌పోర్టు లారీ వద్దకు వెళ్లి ప్రవీణ్‌కుమార్ హమాలీగా అవతారమెత్తారు. అలాగే బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు, ప్ర యాణికులతో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌరస్తా, రామాలయం చౌరస్తాలో అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు కోరుతూ కారు గుర్తుకు ఓట్లు వేసి తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఓ హోటల్‌లో దోశవేసిన ఆయన అందరినీ నవ్వుల్లో ముంచెత్తారు. తనను ఎంపీగా గెలిపిస్తే అన్ని వర్గాల వారి సమస్యలను తీర్చడంతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధికి తాను శక్తివంచలేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడి యా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కాటం జంబులయ్య, తెలంగాణ మలిదశ ఉద్యమనాయకుడు కట్టాశ్రీనివాసులు, ఎంపీటీసీ శంకర్‌నాయక్, కౌన్సిలర్లు పస్పులకృష్ణ, కృష్ణామూర్తి, సింగిల్‌విండో డైరెక్టర్ నర్సిం హ, బీఆర్‌ఎస్ నాయకులు బ్రహ్మయ్య, విష్ణుతేజ, మహేశ్, వెంకటేశ్, రవినాయక్, శేఖర్,విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.



బస్తాలు మోస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- ఉమ్మడి జిల్లాలో రెండ్రోజులపాటు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపర్య టన
- 26న మహబూబ్‌నగర్, 27న నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షో
- ఏర్పాట్లు చేస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి
- 25న మహబూబ్‌నగర్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్
- బీఆర్‌ఎస్ అధినేతరాకతో పొలిటికల్‌హీట్
- ఇప్పటికేనాలుగుసార్లు పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలో అమిత్ షా బహిరంగసభకు సన్నాహాలు
- గెలుపే ధ్యేయంగా ప్రధాన పార్టీల కసరత్తు





## బీఆర్‌ఎస్ కంచుకోట

కేసీఆర్ పాలమూరు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడే తెలంగాణ స్వరాష్ట్ర కల సాధ్యమైంది. దీంతో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం చరిత్రలో నిలిచిపోయింది. 2009, 2014, 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వరుసగా మూడుసార్లు విజయం సాధించడంతో పాలమూరు గులాబీ కంచుకోటగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పరాజయం పాలైనప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు వచ్చే వరకు సీన్ మొత్తం రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఇటీవల సీఎం ఎన్నికల పర్యటనలకు అనుకున్న స్థాయిలో జనం రాకపోవడమే ఇందుకు నిదర్శనం. కాగా గులాబీ కంచుకోటలో పాగా వేసేందుకు ఇటు అధికార పార్టీ.. అటు బీజేపీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పటి నుంచి పాలమూరు ప్రజలు గులాబీ దళపతి కేసీఆర్ వెంటనే ఉన్నారు. ఈసారి కూడా పాలమూరు లోక్‌సభలో తీవ్ర పోటీ నడుస్తున్నది. త్రిముఖ పోటీ అనివార్యమైంది. గెలుపు కోసం అన్ని పార్టీలు శ్రమిస్తున్నాయి. ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి.

# పాలమూరుకు గులాబీ బాస్

### సీఎం రేవంత్‌కు ఓటమి భయం..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని అధికార పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే నాలుగు సార్లు పార్లమెంట్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండు, మూడు టూర్లు మరోసారి ఉండబోతున్నాయని పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఇటు బీఆర్‌ఎస్ నుంచి అటు బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నది. సీఎం సొంత జిల్లా కావడంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఎలాగైనా గెలిచి తీరాలని భావిస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ ఎన్నికల ప్రచారంలో సీఎం వాడిన భాష పాలమూరు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రెచ్చగొట్టేలా సీఎం మాట్లాడడంతో ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ ఓడిపోతే సీఎం కుర్చీకే ప్రమాదమని.. అందుకే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో ఎక్కడా ఇవ్వని విధంగా పాలమూరు పార్లమెంట్‌కి ఎక్కువ టైం కేటాయించడం ఇందుకు నిదర్శనం అని అంటున్నారు.

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో కేసీఆర్ అడుగు పెట్టబోతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రోడ్ షోలో పాల్గొంటున్నారు. ఈనెల 26న మహబూబ్‌నగర్, 27న నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో రోడ్ షో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్.. నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కేసీఆర్ పర్యటన ఖరారు కావడంతో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో పొలిటికల్ హీట్ పెరిగింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఎలాగైనా గెలవాలని ఇప్పటికే నాలుగుసార్లు వచ్చి వెళ్లారు. త్వరలో మరోసారి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. బీజేపీ కూడా మహబూబ్‌నగర్‌లో అమిత్ షాతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రముఖుల రాకతో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కనున్నాయి. అన్ని పార్టీలు లోక్‌సభ ఎన్నికలను టార్గెట్ చేసి గెలుపే ధ్యేయంగా ప్రచారం చేస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. పోలింగ్‌కు ఇంకా 22 రోజుల సమయం మాత్రమే ఉండడంతో అన్ని పార్టీలు ప్రచారంలో స్పీడ్ పెంచాయి. కాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 25న భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

***26, 27న కేసీఆర్ రోడ్ షోలు***

పార్లమెంట్ ఎన్నికల సమరం ఉమ్మడి పాలమూరు జిల్లాలో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గులాబీ బాస్ కేసీఆర్ ఈనెల 26, 27న ఉమ్మడి పాలమూరు జిల్లాలో రోడ్‌షోలో పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించనున్నారు. ఈనెల 26న మహబూబ్‌నగర్‌లో అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా కేసీఆర్ రోడ్ షోలో పాల్గొంటున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డిలు భారీ ఎత్తున రోడ్ షోకు జన సమీకరణ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ రోడ్ షో లో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నది. కేసీఆర్ 26న రాత్రి మహబూబ్‌నగర్‌లోనే బస చేసి పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష చేపట్టనున్నారు. ఎలాగైనా కాంగ్రెస్‌ను ఓడించి సీఎం రేవంత్ రెడ్డికి షాక్ ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ పావులు కదుపుతోంది. మరుసటి రోజు సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో జరిగే రోడ్ షోలో కేసీఆర్ పాల్గొననున్నారు. పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేపడుతారు. ఈ మేరకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ రోడ్‌షోను విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించింది. నియోజకవర్గాల్లో పార్టీ ప్రచారాలు విస్తృతంగా జరిగేలా ఇన్‌చార్జీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మండల స్థాయినేతలకు దిశా నిర్దేశం చేస్తారు.

***అమిత్ షాతో ప్రచార సభలు***

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఒంటరిగా పోటీ చేస్తున్న బీజేపీకి కలిసి రావడం లేదు. గతంలో ఒకసారి తెలుగుదేశం పార్టీ పొత్తుతో బీజేపీ పాలమూరు పార్లమెంట్‌లో పాగావేసింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వరుస ఓటముల పాలవుతున్నది. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు కేసీఆర్ అటు సీఎం రేవంత్‌రెడ్డి.. మరోవైపు ప్రధాని మోదీ కూడా మహబూబ్‌నగర్‌కు ఎన్నికల ప్రచారానికి వస్తుడడంతో పాలమూరు పార్లమెంట్‌లో రాజకీయ వేడి రగులుతున్నది.

# కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోవద్దు

- హామీలు అమలు చేయకుండా కాలయాపన
- ఎకరాకురూ .25వేల నష్టపరిహారం చెల్లించాలి
- మాజీమ ంత్రి శ్రీనివాస్‌గౌడ్
- నాయినోనిపల్లిలో ఎండినపం టలపరి శీలన


హన్వాడ, ఏప్రిల్ 21 : ఆరు గ్యారెంటీలతోపాటు అనేక అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా కాలయాపన చేసేందుకు ప్రయత్నిస్తున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. అందుకే ప్రజలు మరోసారి కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని సూచించారు. ఆదివారం మండంలోని నాయినోనిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎండిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ.25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ పాతరోజులొచ్చాయని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు దాటినా నేటికీ ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు రైతుబీమా, రైతుబంధు, 24గంటల కరెంటు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు అండగా నిలిచాయని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం భారతదేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేసిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు చేస్తామని, రైతుబంధు పెంచుతామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, వడ్లకు బోనస్ రూ.500 చెల్లిస్తామని, కల్యాణలక్ష్మికి నగదుతోపాటు తులం బంగారం ఇస్తామని మాయ మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి నేడు సీఎం అయిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అందుకే రైతుల పక్షాన ఉన్న బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని, మీకు అండగా ఉండి మీ తరపున పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం తిరుమలగిరిలో రైతులు, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు. రైతుల పక్షాన ఉండే బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా ఉండాలని, ఎంపీగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, సింగిల్ విండో చైర్మన్, వైస్‌చైర్మన్ వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ వడ్ల శేఖర్, నాయకులు కొండ లక్ష్మయ్య, కొండ బాలయ్య, నరేందర్, చెన్నయ్య, ఆశన్నతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



నాయినోనిపల్లిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# చిత్తశుద్ధిలేని సర్కారు

- అలివిగాని హామీలతో రైతులను రోడ్డున పడేసిన కాంగ్రెస్
- కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- పెంట్లవెల్లిలో ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో..



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం, ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీ

పెంట్లవెల్లి, ఏప్రిల్ 21 : చిత్త శుద్ధిలేని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎనికల్లో ప్రజలు ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేసి వారిని రాజును చేస్తే...మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అదే రైతులను మోసం చేసి రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో పెండింగ్ పనులను ఈ ప్రాంత మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సూచించారు. విద్యావంతుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే ప్రజాగొంతుకై మన ప్రాంత సమస్యలను ఢిల్లీలో కొట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకు ముందు పెంట్లవెల్లిలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణ సముదాయ యాజమానులను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పాత బస్టాండ్ సమీపంలో గులాబీ జెండాలె రామక్క పాటకు కార్యకర్తలతో కలిసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన నృ త్యం ఓటర్లను ఎంతగానో ఆకట్టుకున్నది.


### ఈ ప్రాంత మట్టి బిడ్డనైన నన్ను ఆశీర్వదించండి

ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన మీ మట్టి బిడ్డను.. నన్ను పార్లమెంట్ ఎన్నికలో అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించండి. పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాను. ఎక్కడి నుంచో వచ్చిన దొంగలకు ఓటు వేస్తే మళ్లీ మోసపోతాం.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలుగా అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. తెలంగాణ ప్రజలు తిరిగి మళ్లీ కేసీఆర్ రావాలి అంటున్నారు. ఇప్పుడు గనుక తిరిగి అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారు. కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పేందుకు కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి . మీ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం నిరంతం మీ వెంటే ఉంటా..

**– ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి**

# నేటి నుంచి సలేశ్వరంఉత్సవాలు

అచ్చంపేట, ఏప్రిల్ 21 : చుట్టూ అడవి.. కొండలు.. కోనలు.. జలపాతాలు.. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే నల్లమల అటవీ ప్రాంతంలోని దట్టమైన లోయలో(సలేశ్వరం) వెలిసిన లింగమయ్య దర్శనం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు భక్తులు. ఆ పరమేశ్వరుడి మహదర్శన భాగ్యం నేటి నుంచి 24వరకు అటవీశాఖ అధికారులు కల్పించనున్నారు. అందులో భాగంగా నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు అడవిలోకి అనుమతి ఇవ్వనున్నారు. ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నది. ఈ జాతరను సాహసోపేత తెలంగాణ అమరనాథ్ యాత్రగా పిలుస్తుంటారు.



వాటర్‌ఫాల్ వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)